గౌండ్ల మఠంలో మహా అన్నదానం


అన్నదానం చేస్తున్న నవీన్‌కుమార్‌గౌడ్, నిర్మల నీలకంఠంగౌడ్ తదితరులు

జియాగూడ: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మహా అన్నదానాన్ని ప్రతి యేటా భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు గౌండ్ల మఠం సురాభాండేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గొడిశాల సరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్రా భాస్కర్‌గౌడ్ అన్నారు. శనివారం పురానాపూల్ రహింపురాలోని గౌండ్ల మఠం సురాభాండేశ్వర ఆలయంలో మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా సురాభాండేశ్వర భ్రమరాంబదేవీల కల్యాణ మహోత్సవం, పురవీధుల్లో పల్లకీ సేవా ఊరేగింపు, నూతన జంటలతో అగ్నిగుండాల కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం కౌండిన్య హాల్‌లో మహా అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు గోదా వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డమీది యజ్ఞేశ్వర్‌గౌడ్, కోశాధికారి నిర్మల మనుజందర్ గౌడ్, కార్య నిర్వాహక కార్యదర్శి పంజాల అశోక్‌కుమార్ గౌడ్, సభ్యులు కొత్త ప్రవీణ్‌కుమార్ గౌడ్, మల్లం శివగౌడ్, నిర్మల ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఎర్ర శ్రీనాథ్ గౌడ్, అశోక్‌గౌడ్, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ డివిజన్‌లోని ఖాదర్‌బాగ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాదర్‌బాగ్‌లో అన్ని రోడ్లు, గల్లీలలో వీడీసీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. రోడ్లు వేయకముందే డ్రైనేజీ పనులు కూడా చేపట్టామని తెలిపారు. స్థానిక మజ్లిస్ నాయకుడు షబ్బీర్ అలీఖాన్, స్థానికులు డ్రైనేజీ, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో వాటిని కూడా పరిష్కరించామన్నారు. యువకులు ఐక్యంగా బస్తీ అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. రంజాన్ మాసంలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు. నల్లాలలో నీళ్లు రాని రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం ఆయన ఖాదర్‌బాగ్ అసోసియేషన్ సభ్యులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు.

శిథిలావస్థలో కోట దర్వాజాలు

- నిర్వహణ లోపంతో కూలడానికి సిద్ధంగా దర్వాజాలు
- పరిరక్షణను పట్టించుకోని అధికారులు


నిర్వహణ లోపంతో అధ్వానంగా మారిన బంజారా దర్వాజ తలుపు రెక్క


ఒక్కొటిగా ఊడిపడుతున్న జమాలి దర్వాజ తలుపు రెక్క

గోల్కొండ: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గోల్కొండ కోట ప్రహరీ గోడలకు ఉన్న దర్వాజాలు ఒకొక్కటిగా కూలుతున్నాయి. తూతూ మంత్రంగా వీటికి చేస్తున్న మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. ప్రతి నిత్యం గోల్కొండ కోటకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కోటను చూసి తిరుగు ప్రయాణంలో కోట దర్వాజాల తలుపు రెక్కలు చూసి వారు ఇదేనా చారిత్రక సంపద పరిరక్షణ అంటూ మండిపడుతున్నారు. గోల్కొండ కోటకు ఫతేదర్వాజా, మోతీదర్వాజా, బంజారా దర్వాజా, జమాలి దర్వాజాలు కోటకు వచ్చే దానికి ప్రధాన మార్గాలుగా ఉన్నాయి. మక్కైయి దర్వాజా ప్రాంతం గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ వారి నిఘా ఉండడంతో అది నేటికి చెక్కు చెదరకుండా ఉంది. అయితే మిగతా దర్వాజాలు వాటికి ఇనుప తాపడం ఉండడంతో తుప్పు పడుతున్నాయి. దర్వాజాలకు ఉన్న ఒక్కో తలుపు ఎన్నో క్వింటాళ్ల బరువు ఉంటుంది. శత్రు సేనలు గోల్కొండపైన దాడి చేసినప్పుడు ఏనుగులు సైతం దర్వాజా బలానికి అవి ఓడిపోయాయి. అంతటి పటిష్టమైన దర్వాజాలు నేడు అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్నాయి.

వ్యర్థాల డంపింగ్..

దర్వాజాల వద్ద చెత్త డంపింగ్ అవుతోంది. ఈ కారణంగా దర్వాజా కింది భాగం రూపుమారుతోంది. మరోవైపు వర్షాకాలంలో దర్వాజాల కిందిభాగం వర్షం నీటికి నానుతూ అది కరిగిపోతోంది. దర్వాజాల పరిరక్షణకు దర్వాజాల పోడవునా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పటిష్టమైన దర్వాజా తలుపులు కుంగిపోతున్నాయి. గతంలో ఒకసారి వర్షాకాలంలో మోతీదర్వాజాకు ఉన్న ఓ తలుపు రెక్క భారీ శబ్దం చేస్తూ నెలకొరిగింది. క్వింటాళ్ల బరువు ఉన్న ఆ తలుపు రెక్కను చూసి ప్రజలు ఔరా ఏమి దర్వాజా అంటూ ఆశ్చర్యపోయారు. అయితే ఆ దర్వాజ సంఘటనతో అధికారులు దర్వాజా నెలకొరగకుండా దర్వాజా గోడలకు తలుపు మీదుగా గొలుసులాంటి ఇనుప పట్టిని అమర్చారు. అయితే జమాలి దర్వాజా, బంజారి దర్వాజాల వద్ద తలుపుల కింది భాగం పూర్తిగా దెబ్బతిన్నది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ పర్యవేక్షణలో ఉన్న గోల్కొండ కోట ప్రహరీలు, పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కోట లోపల అధునాతన లేజర్ లైట్ అండ్ షోను ప్రారంభించిన అధికారులు దర్వాజాల తలుపుల మరమ్మతులకు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దర్వాజాల నిర్వహణ ఇదే విధంగా ఉంటే కొద్ది కాలంలో దర్వాజా తలుపు రెక్కలు ఒకొక్కటి కూలడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


చెక్కును అందజేస్తున్న మర్చట్ అసోసియేషన్ ప్రతినిధులు

గోల్కొండ: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని కార్వాన్ మర్చట్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కార్వాన్ మార్కెట్‌లోని శివ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయ అభివృద్ధికి అసోసియేషన్ తరపున శివమందిరం కమిటీ అధ్యక్షుడు బొడి అనుయాదవ్‌కు విరాళంగా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మర్చంట్ అసోసియేషన్ సభ్యులు బోడి ప్రేమ్‌కుమార్‌యాదవ్, రాముగులేకర్, గోదా లక్ష్మణ్‌యాదవ్, దత్త నాగేష్, రాధాకృష్ణ, యోగేష్ తదితరులున్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు పొందిన వారితో కరస్పాండెంట్ హిదాయత్ అలీఖాన్

గోల్కొండ: విద్యార్థి దశలో ప్రీ ప్రైమరి ముఖ్య ఘట్టమని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మొహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. శనివారం టోలిచౌకి డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థలలో చదువు పూర్తి చేసుకున్న వారు నేడు తెలంగాణతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడిగా ఫేర్‌వెల్ వేడుకలు



బహదూర్‌పురా: గురునానక్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తూ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గురుద్వారాల అధ్యక్షులు గురుచరణ్ సింగ్ బగ్గా, సిక్ హెరిటేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు సర్దార్ ప్రీతమ్ సింగ్, సిక్ హెరిటేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ నాయకులు బందర్ సింగ్, దర్శన్ సింగ్, ఇగ్బాల్ సింగ్, డాక్టర్ సర్జన్ సింగ్‌తో పాటు ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'నాగర్ కర్నూల్‌లో బీజేపీ విజయం ఖాయం'


భరత్‌ను అభినందిస్తున్న బాలకృష్ణ తదితరులు

చార్మినార్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ (ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న పోతుగంటి భరత్‌ను బీజేపీ సీనియర్ నాయకులు గాదేపాగ బాలకృష్ణ ఆధ్వర్యంలోని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజక వర్గం నుంచి తప్పనిసరిగా విజయం సాధిస్తారని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో అల్వాల్ శివకుమార్, జీ.భరత్‌కుమార్ తదితరులున్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిరంతర సమాజ సేవ


ఉస్మాన్‌గంజ్ అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న వరకుమార్‌గుప్తా, గోపాలకృష్ణ తదితరులు

అబిడ్స్: వాసవీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిరంతరం సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ప్రాజెక్ట్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ఉప్పల వరకుమార్‌గుప్తా పేర్కొన్నారు. ఉస్మాన్‌గంజ్ అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ, కోఠి ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్‌ల పంపిణీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ..సమాజ సేవే ధ్యేయంగా ముందుకు పోతుందన్నారు. వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమాజంలో అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్‌గా పీఎన్‌డీ ప్రసాద్



గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పీఎన్‌డీ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో నల్గొండలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న 2007 బ్యాచ్‌కు చెందిన పీఎన్‌డీ ప్రసాద్‌ను మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ.. రానున్న రంజాన్ ఉపవాస దీక్షలు, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా


ఇన్‌స్పెక్టర్ రామస్వామి

జియాగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ బి.రామస్వామి అన్నారు. ఇటీవల కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించిన అశోక్ కుమార్ బదిలీపై వెళ్లడంతో గద్వాల్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన రామస్వామి కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి ఊరేగింపులు కొనసాగినా శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా విశేషంగా కృషి చేస్తామన్నారు. అలాగే రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపడంతో పాటు వారి కదలికలను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తామన్నారు.

మహిళలను అందరూ గౌరవించాలి


ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ..

అబిడ్స్: ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజ్ క్యాంపియన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళా శక్తిని అభివృద్ధి చేయడం, మహిళల ప్రమేయం, మహిళల సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు వృత్తిపరంగా ఎదుర్కొనే ఇబ్బందులను సునాయసంగా ఎలా ఛేదించాలో వివరించారు. మహిళలను అందరూ గౌరవించాలని ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



డబీర్‌పురా: డబీర్‌పురా ఉస్మాన్‌పురాలోని మాస్టర్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇ.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ ఇ.మాధవితో పాటు ఆయేషా పర్వీన్, సదాలక్ష్మీ, సుకన్య, సుజాత్, ఆయేషా పాల్గొన్నారు.

'తెలంగాణలో అన్ని ఎంపీ స్థానాలు మావే'

గోల్కొండ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్లమెంటు స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో లాగానే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ప్రజల మద్దతు కోరడం ఖాయమన్నారు. అన్ని పార్లమెంటు స్థానాలను గెలిచి మరోసారి కాంగ్రెస్ సత్తాచాటుతుందని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన బయోటెక్నాలజీ పీజీ తరగతులకు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.బాల భాస్కర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55% ఉత్తీర్ణతతో పాటు అభ్యర్థులు పీహెచ్డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోడానికి అర్హులు. అధ్యాపకులుగా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. కళాశాల విద్య జారీ చేసిన నియమ నిబంధనలను అనుసరించి ఎంపికైన వారికి జీతాలు చెల్లించబడును. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 3గంటల లోపు తమ ధ్రువీకరణ పత్రాలతో బయోటెక్నాలజీ శాఖాధిపతిని సంప్రదించాలని కోరారు.

ముగిసిన పుష్కర బ్రహ్మోత్సవాలు



అబిడ్స్: పూసలబస్తీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీవారి సుప్రభాత సేవా, విష్ణు సహస్రనామ కార్యక్రమం, శ్రీవారి తిరుకల్యాణోత్సవం, మంగళ నీరాజనం, సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవా నిర్వహించారు. ఈనెల 1న ప్రారంభమైన వేడుకలు 8వ తేదీ శుక్రవారం రాత్రి వరకు కొనసాగాయి. ముగింపు రోజు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పూసలబస్తీతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

లంచ్ విత్ క్లాస్ టీచర్


క్లాస్ టీచర్లతో వివిధ తరగతుల విద్యార్థులు

గోల్కొండ: తల్లిదండ్రుల తర్వాత క్లాస్ టీచరే పిల్లలకు తల్లిలాంటి వారని గోల్కొండ నయాఖిలాలోని ఉర్సా హైస్కూల్ అకాడమిక్ హెడ్ సమీనా తన్వీర్ అన్నారు. శనివారం పాఠశాలలో లంచ్ విత్ యువర్ క్లాస్ టీచర్ అనే వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు తమ తమ క్లాస్ టీచర్‌తో కలిసి లంచ్ చేశారు. కార్యక్రమంలో యాస్మీన్‌బేగం, తనర్నుమ్ బేగం, తహనీయత్ ఉన్నీసా, ఫహీన్ సుల్తానా, నాగలక్ష్మి తదితరులున్నారు.

చౌమహల్లా ప్యాలెస్‌ను చూసొద్దాం రండీ


విద్యుత్ దీప కాంతుల్లో తళుక్కుమంటున్న చౌమహల్లా ప్యాలెస్

చార్మినార్: అసఫ్ జాహీల రాచరిక పాలనకు పాత నగరంలోని చౌమహల్లా ప్యాలెస్ 'సాక్షి'గా నిలుస్తుంది. రెండో నిజాం కాలంలో చార్మినార్–లాడ్‌బజార్‌కు అతి సమీపంలో ఈ ప్యాలెస్ నిర్మాణం జరిగింది. యూరోపియన్ శైలిలో అత్యంత ఆకర్షణీయంగా పాలరాతి వలే నిర్మితమైన చౌమహల్లా ప్యాలెస్ చార్మినార్ కట్టడానికి దగ్గరలోని ఖిల్వత్‌లో ఉంది. చార్మినార్ కట్టడం నుంచి లాడ్‌బజార్, ఖిల్వత్ చౌరస్తా ద్వారా ముందుకెళితే ఖిల్వత్ వస్తుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడ ముచ్చటగా ఉంటుంది. సందర్శకులకు కనువిందు కలిగిస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మ్యూజియం సందర్శన ఉంటుంది. దేశ విదేశీ పర్యాటకులను అధికంగా ఆకట్టుకుంటున్న చౌమహల్లా ప్యాలెస్ సందర్శనకు రద్దీ పెరుగుతోంది. సాధారణ రోజుల్లో కన్నా వీకెండ్, సెలవు రోజుల్లో సందర్శకుల సందడి అధికంగా ఉంటుంది.

యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం..

చార్మినార్ కట్టడం నుంచి వాకబుల్ డిస్టెన్స్‌లో ఉన్న ఈ చౌమహల్లా ప్యాలెస్ యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం. ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి. 5వ నిజాం అఫ్జల్–ఉద్–దౌలా–బహదూర్ పాలనా (1857–69) కాలంలో ఖిల్వత్ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది. టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్ మహల్, మహ్తాబ్ మహల్, తహనియత్ మహల్, అఫ్జల్ మహల్‌ల నిర్మాణం జరిగింది. 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో ప్యాలెస్ మరింత శోభాయమానంగా మారింది.

నిజాం ప్రభువుల నివాస గృహంగా..

ఇది నిజాం ప్రభువుల నివాస గృహంగా ఉండేది. దాదాపు 2.90 లక్షల గజాల విస్తీర్ణంలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించబడింది. ఆనాటి కాలంలో విద్యుత్ లైట్లు లేని కారణంగా ప్యాలెస్‌లో వెలుగుల కోసం షాండిలియర్లను ఏర్పాటుచేశారు. వీటిలో పొగరాని కొవ్వత్తులు, మైనపు ఒత్తులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం విద్యుత్ దీపాలు ఉండడంతో షాండిలియర్లు దేదీప్యమానంగా వెలుగుతూ చౌమహల్లా ప్యాలెస్‌కు మరింత శోభను తీసుకువస్తున్నాయి. 1915లో చౌమహల్లా ప్యాలెస్ ప్రధాన గేట్ వద్ద అతిపెద్ద గడియారాన్ని ఏర్పాటుచేశారు. విదేశాల నుంచి వచ్చే అతిథులందరికీ చౌమహల్లా ప్యాలెస్‌లో ఆతిథ్యమిచ్చేవారు.

మ్యూజియంలో చూడదగ్గవి..

నిజాం కాలంలో వినియోగించిన ఫర్నీచర్, మంచాలు, దుస్తులు, తల్వార్లు, ఫొటోలు తదితర విలువైన పురాతన వస్తువులన్నింటినీ చౌమహల్లా ప్యాలెస్‌లోని నాలుగు ప్యాలెస్‌లలో భద్రపరిచారు. ప్రస్తుతం నిజాం ట్రస్ట్ పర్యవేక్షణలో చౌమహల్లా ప్యాలెస్ కొనసాగుతోంది.

కల్యాణం.. కమనీయం

- కనుల పండువగా శివపార్వతుల కల్యాణం
- భక్తిశ్రద్ధలతో జాగరణ వేడుకలు
- కిటకిటలాడిన భక్తజనం


రక్షాపురం శివాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చాంద్రాయణగుట్ట: రక్షాపురం శివాలయంలో శివపార్వతుల కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా కొనసాగింది. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. రాత్రి 8.30 గంటలకు కల్యాణం జరిపించగా, రాత్రి 10.30 నుంచి లింగోద్భవ కాలం వరకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లింగాష్టకం, హారతి నిర్వహించారు. ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ, ఇన్‌చార్జి పార్థసారథి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో..


సంగం ఆలయంలో బిల్వ చెట్టు కింద శివలింగానికి అభిషేకాలు

చార్మినార్: మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శని వారం ఉదయం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ముగిశాయి. తెల్లవారు జామునే శివాలయాలకు వెళ్లిన భక్తులు పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ఉపవాస దీక్షలు విరమించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవంతో పాటు అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, శివలింగానికి పాలాభిషేకం, అర్చన, జాగరణ, రాత్రి 12.30 గంటలకు మహా హారతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో..

అబిడ్స్: మహా శివరాత్రి జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో మహా జాగరణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో పలు పాటలు, భక్తి గీతాలతో భక్తులను అలరించారు. సమితి అధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రధాన కార్యదర్శి రాజన్‌కుమార్, నాయకులు రాజేందర్ సింగ్, రంజిత్ కుమార్, లక్ష్మీనారాయణ వర్మ, జీఎస్.ప్రకాష్‌రావులతో పాటు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రముఖ గాయకులు రాజన్‌కుమార్, హరి ఓం మిశ్రలు తమ గీతాలతో అలరించారు.

బోధేఅలీషా కిడికి ప్రాంతంలో..

డబీర్‌పురా: డబీర్‌పురా బోధేఅలీషా కిడికి ప్రాంతంలోని పోచమ్మ ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భారత నవయుగ సమాజ్ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకం, శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద..

లంగర్‌హౌస్: మహా శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద వెలసిన జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి మఠ ఆలయంలో పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి పెద్దయెత్తున భక్తులు తరలిరాగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణ పార్వతీపరమేశ్వరులను నందిపై ఊరేగించారు. తెల్లవారు జాము వరకు అభిషేకాలు, లింగోద్భవం, జాగరణ కార్యక్రమాలు జరిగాయి. శనివారం తెల్లవారుజామున బిల్వచెట్టు కింద వెలసిన శివలింగానికి అభిషేకాలు చేసి ఉపవాసదీక్షలు విరమించారు.


మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో..


జాగరణ వేడుకల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాడిశెట్టి సదానందం గుప్తా


వేడుకల్లో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత


డబీర్‌పురాలోని పోచమ్మ ఆలయంలో..